కథానిక

# బూచి

శాంతారావుకి కొంపలో శాంతి కరువయింది భార్య శాంతి సేనికోదానికి, కయ్యానికి కాలు దువ్వుతూనే ఉంటుంది.

శాంతికి మనశ్శాంతి లేకుండా పోయింది. భర్త శాంతారావు దేనికో దానికి సణుగుతూనే ఉంటాడు. గొణుగుతూనే ఉంటాడు.

"నన్ను తిట్టినా ఏమనుకోను! కాని పిల్లల ఎదర నన్ను ఎదిరించి అవమానించకు!" శాంతారావు మొర శాంతి ఖాతరు చెయ్యదు.

"ఇంట్లో ఎన్నన్నా అనండి. ఇతరుల ఎదుట నన్ను గౌరవించటం నేర్చుకోండి!" శాంతి వచనాలు శాంతారావు చెవిని సోకవు.

శాంతారావు తన ఆఫీసులో తనతో పనిచేస్తున్న రోజాను చూపించి. "ఆ రోజాను చూడు! రోజంతా కష్టపడి పని చేస్తుంది. సాయంత్రం మొగుడికి, పిల్లలకి యింత వండి పెట్టి—నవ్వుకుంటూ వీధిలో వెన్నెల్లో విహరిస్తుంది!" అంటాడు.

శాంతి ఠక్కున సమాధానం చెప్పేస్తుంది.

"ఆ వెంకట్రావుని చూడండి. ఉదయం పోతాడు. సాయంత్రం వస్తాడు. ఆ చవిటి ముక్క భార్యకి వంటయినా రాదు. అయినా సరే-తనే యింత వండి భార్యకి పిల్లలకీ పెట్టి మోటారుసైకిలు మీద సినిమాకి తీసుకు పోతాడు!"

శాంతారావు మరి మాట్లాడడు.

శాంతి ముఖం కాంతివంతం అవుతుంది,

ఆదివారం కొందరికి ఆనంద వారం. మరికొందరికి ఆందోళన వారం.

ఎక్కడ మొదలయింది? ఎలా మొదలయింది? అంటే చెప్పడం కష్టం! మొదలవడం మొదలయి రెండు గంటలు కావస్తుంది— పతాక సన్నివేశానికి చేరుతూంది కథ. శాంతి శాంతారావుల డైలాగులు వినబడుతున్నాయి. 9

"మీ అమ్మ బుద్ధే అటువంటిది! మీ నాన్నఅంత! మీరూ అంతే! అసలు మీ వంశమే అంత! వెధవ జెడ్డ! మీరూ మనుషులే? ఆ రూపాన ఉన్న రాక్షసులు కాని!"

"మీ నాన్న జనక మహారాజనుకుంటాను! బయల్దేరావు అయోనిజవి! మీ అమ్మ పరమ గయ్యాళి. అల్లుడనేనా ఆలోచించకుండా-తొలిరాత్రి అనయినా సందేహించకుండా—చీర పైకిదోపి, జుట్టు ముడి బిగించి చిందులు తొక్కింది. అసలు తొలి రాత్రే నాకు వెలితి రాత్రి అయింది. ఇంక ఈ దాంపత్యంలో వెలుగెక్కడ?"

—మ. రా. శాస్త్రి

"ఆ ఊసెత్తకండి! అందుకు కారకులు మీరు కాదూ? అందరినీ పిలుస్తానని సరదాపడితే, కుదరదని మొండిగా మీరు చెప్పలేదూ? పదిమంది వస్తే—పది రవికెల గుడ్డలు యివ్వాల్సి వస్తుందని ముఖం చూసుకున్నారు. సుద్ద పిసినారి పీనుగులు మీరు!"

"మరే, మీరు ధారాళహృదయులు! మీ నాన్న దివాన్‌గిరీ వెలిగించిన ముండాకొడుకు! అందుకే తమల పాకు తొడిమకి ముఖం చూసుకున్నాడు."

"ఛీ ఛీ! మీతో నాకు మాటలేవిటి?"

"థూ! థూ! నీతో నాకు పనేమిటి!"

పదేళ్ళ పద్మ పుస్తకం చదువు కుంటూంది, "స్వీట్‌హోం" స్పెల్లింగ్ బట్టీయం వేస్తూంది.

x x x

సోమవారం.

శాంతారావు శాంతంగా రాజీధోరణిలో భార్యతో అన్నాడు.

"చూడు శాంతీ! మనం యిలా చిన్నపిల్లల్లా కొట్లాడుకోవడం ఏం బాగుండ లేదు. మనకేం లేదా పోదా ? పదేళ్ళ క్రిందటి పెళ్ళిగొడవలు తవ్విపోసుకొని తన్నుకోవడం మూర్ఖత్వం కాదూ?"

"అవును. మనం ఎంత తన్నుకు చచ్చినా ఆ ముసిలాళ్ళు యిక మారేది ఎలాగూలేదు. మధ్య వాళ్ల కోసం మనం బుర్రలు బద్దలుకొట్టుకోవడం ఎందుకు?"

"అదే చెపూంట. మనం ఆనందంగా గడుపుదాం. సుఖశాంతుల్ని పంచుకుందాం!"

"సరే! సాయంత్రం వేగిరరండి. తెమిలి ముస్తాబయి వుంటాను. అలా గాలిలో తిరిగి ఎవరింటికయినా వెళ్ళొద్దాం!"

"ఓ. కె. అలాగే!"

పెరుగు ముద్దలు మింగి, పరుగు పరుగున బస్సు అందుకున్నాడు శాంతారావు. శాంతి యింటి చాకిరీలో మునిగి పోయింది.

శరీరాలు వాటి బాధ్యతల్ని అవి నెరవేరుస్తుంటే బుర్రలో ఆలోచనలు మాత్రం పక్కదోవలు పడుతున్నాయి.

బాత్‌రూమ్‌లో బట్టలు ఉతుక్కుంటూ శాంతి:

"రోజా అంటే ఆగనంత అభిమానం. ఇంత సుగుణాలరాసి ఈయన ఆఫీసులోనే దాపురించాలా? నా దగ్గర మెచ్చుకున్నట్టే దాని దగ్గరా పొగుడుతారా? 10 పొగిడితే పొంగిమీద పడని ఆడది ఎవత్తి? ఆఫీసులో ఒంటరిగా దొరికితే.. రోజాని..."

శాంతారావు రోజాని దగ్గరికి తీసుకొని గుండెలకు హత్తుకుంటున్నట్టు—మెదడుమీద ఉచిత సినిమా నడిచింది.

శాంతారావు ఆఫీసులో పనిచేసుకుంటూ:

"శాంతికి వెంకట్రావు అంటే అంత యిష్టమా? వెంకట్రావుకి శాంతి పట్ల అంత యిష్టత ఉందా? తను లేనప్పుడు శాంతి వెంకట్రావుని ఆహ్వానించి కబుర్లు చెప్పడం లేదుగదా?"

శాంతి వెంకట్రావులు ఒకరినొకరు పొగుడుకుంటూ కామించుకున్నట్లు మనో

నేత్రం చూసింది. చేతిలో పని ఆగిపోయింది.

x x x

సాయంత్రం శాంతి అందంగా తయారయి సిద్ధంగా వుంది.

శాంతారావువచ్చి టిఫిను కాఫీ సేవించి భార్యను చిరునవ్వుతో పలకరిస్తూ, స్కూటర్ తీస్తూ "ఎక్కడికి వెడదాం?" అన్నాడు.

"స్కూటరెందుకు? పెట్రోలు దండగ! అలా కాస్సేపుతిరిగి. వెంకట్రావు గారింటికి వెళ్ళి వచ్చేద్దాం?" అందిశాంతి.

శాంతారావు మదురు చిట్లించి:

"స్కూటరు మీద పార్కుకి వెళ్ళి అలా వస్తూ రోజా యింటికి వెళ్ళి రావచ్చు-అనుకున్నాను."

శాంతి ముఖం మాడ్చుకొని:

"మన ఊహలు ఎప్పుడు ఒకటయాయి? ఎక్కడికీ ఒద్దు లెండి! తలనాదుగా ఉంది!"

"నాకూ తల నాదుగానే వుంది!"

వాళ్ళ తలల్లో వున్నది నాదుకాదు; నాచులాంటి బూచి!

—o—

11

# స్వభావం

ఆసాలీడు
ఏ వాగ్దానాల మోహనరాగాల్ని
వినిపిస్తుందో,
ఏ ఆశల మంత్రం వేస్తుందో కాని
పాపం అమాయకపు ఈగకి, తన
కష్టార్జితపు తిండిమీద వెగటు పుట్టి,
తన జీవితం మీద అసంతృప్తి పెరిగి
ఆసాలీడు రాజ్యంలోని, ఆనందాల
అందలం ఎక్కేద్దామనుకొని,
ఆ గూటిలో చేరి, గులామునంటుంది
పాపం, అది వాగ్దానాల ప్రసక్తి
ఎత్తేలోగానే
దాని జీవితం మీద మృత్యువు కత్తి పడుతుంది.

—నిట్టల ఫణిమిత్ర.